

హమాలీలుగా బిహారీలు

ఏటా యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో బిహార్ రాష్ట్రానికి చెందిన హమాలీలే ఎక్కువ పని చేస్తున్నారు. సొంత రాష్ట్రంలో పనులు లేక వలస వస్తున్నారు. 8లో▸



ఆర్‌అండ్‌బీ పునర్విభజన

రోడ్లు, భవనాల శాఖ పునర్విభజన ప్రక్రియ పూర్తయింది. పాలన సౌలభ్యంతో పాటు పనుల్లో నాణ్యత పెంచాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌అండ్‌బీ డివిజన్లను పునర్ వ్యవస్థీకరించింది. 10లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 41.6/29.8

ఆకాశం కొంతమేర మేఘావృతమౌతుంది. ఎండ తీవ్రత కొనసాగుతుంది. మధ్యాహ్నం తర్వాత వేడి, ఉక్కపోత అధికంగా ఉంటాయి. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రేపు ఉచిత స్వర్ణ బిందు ప్రాసన

నిర్మల్ ఖిల్లా: జిల్లా కేంద్రంలోని శ్రీ చక్ర ఆయుర్వేద నాడి వైద్యశాలలో ఈనెల 25న ఉచిత స్వర్ణ బిందుప్రాసన పంపిణీ కార్యక్రమం ఉంటుందని ఆయుర్వేద నాడీ వైద్యులు డాక్టర్ అల్లాడి రవి తెలిపారు. పుట్టిన పిల్లల నుంచి 16 ఏళ్లలోపు వారందరికీ స్వర్ణ బిందు చుక్కల మందు ఉచితంగా అందించనున్నట్లు పేర్కొన్నారు. పిల్లల మానసిక మేధో సంపత్తిని పెంపొందించుటకు, కండరాల బలహీనత, ఎముకల పటిష్టతకు, జీర్ణశక్తి చర్మ రోగాలకు, రోగ నిరోధక వ్యవస్థ పెంపొందించుటకు స్వర్ణ బిందు చుక్కల మందు క్రియాశీలకంగా పనిచేస్తుందని తెలిపారు. జిల్లా కేంద్రంలోని శ్రీ చక్ర ఆయుర్వేద వైద్యశాలలో ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ మందు ఉచిత పంపిణీ ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

పంచగుడి ఇళ్లకు పరిహారం

లోకేశ్వరం : మండలంలోని పంచగుడి గ్రామంలోని రోడ్డుకు ఇరువైపులా ఇళ్లు కోల్పోయిన బాధితులకు పరిహారం డబ్బులు విడుదలయ్యాయని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రటకనలో తెలిపారు. త్వరలో లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు అధికారులు జమాచేస్తారని పేర్కొన్నారు. నిధులు విడుదల చేసిన సీఎం కేసీఆర్‌కు, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలుతెలిపారు.

ఉషు అసోసియేషన్ నూతన కార్యవర్గం



ఎన్నికైన జిల్లా కార్యవర్గ సభ్యులు

భైంసాటౌన్: ఉషూ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని భైంసాలో మంగళవారం ఎన్నుకున్నారు. రాష్ట్ర అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఉమర్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో ఎన్నిక ప్రక్రియ చేపట్టారు. జిల్లా అధ్యక్షుడిగా నాగేశ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీరాముల సాయికృష్ణ, కోశాధికారిగా చందుల స్వామి, ఉపాధ్యక్షులుగా మృణాలిని, శివరాజ్‌గౌడ్, సంయుక్త కార్యదర్శిగా అనూష, అజయ్‌నాయక్, చిరంజీవి, శేఖర్, సభ్యులను ఎన్నుకున్నారు.

రాష్ట్రస్థాయికి భైంసా ఫుట్‌బాల్ జట్టు



భైంసా జట్టుతో ఎంపిక కమిటీ సభ్యులు

భైంసాటౌన్:సీఎం కప్ పోటీల్లో భైంసా ఫుట్‌బాల్ జట్టు రాష్ట్రస్థాయికి ఎంపికైందని పీఈటీ నఫేఖాన్ తెలిపారు. జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించగా ఈ మేరకు భైంసా జట్టు రాష్ట్రస్థాయికి ఎంపికై నట్లు పేర్కొన్నారు. ఈనెల 28న హైదరాబాద్‌లోని జింఖానా స్టేడియంలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు వెల్లడించారు.

కృత్రిమ గర్భాధారణతో మేలైన పశుసంపద




రికార్డులు పరిశీలిస్తున్న శంకర్

లక్ష్మణచాంద: కృత్రిమ గర్భధారణతో మేలైన పశు సంపద లభిస్తుందని జిల్లా పశు వైద్యాధికారి శంకర్ అన్నారు. మండలంలోని వడ్యాల్, లక్ష్మణచాంద గ్రామాల్లోని ప్రాథమిక పశువైద్య కేంద్రాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా రికార్డులను పరిశీలించారు. అనంతరం మండలంలోని చామన్‌పెల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి అనే రైతు కోడి పిల్లల పెంపకాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని పాడి రైతులు తమ పశువులకు కృత్రి గర్భధారణ చేయించేలాగా అవగాహన కల్పించాలన్నారు. కృత్రిమ గర్భధారణ వల్ల వచ్చిన పశు సంపద ఎక్కువ పాలు, ఎక్కువ మాంసం ఇస్తాయని తెలిపారు. అధిక ఫ్యాట్ ఉంటుందని రైతులకు వివరించి వారు తమ పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించేలాగా చర్యలు చేపట్టాలన్నారు. రెండవ విడత గొర్రెల పంపిణీకి అర్హులైన వారి వివరాలు త్వరగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. పశువులకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని మండలంలో విజయవంతం చేసేందుకు అధికారులు అన్ని రకాల చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందులో మండల పశు వైదులు అజయ్ కుమార్, వెటర్నరీ అసిస్టెంట్ దీపిక, గోపాల మిత్రలు రాజు, ముత్యం పాల్గొన్నారు.

సివిల్స్‌లో సత్తా చాటారు

- ఉమ్మడి జిల్లా నుంచి నలుగురు
- 35వ ర్యాంకుతో అదరగొట్టిన సంకేత్

చెన్నూర్‌రూరల్/దండేపల్లి/లక్సెట్టిపేట/రెబ్బెన: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన నలుగురు యువకులు సివిల్స్‌లో సత్తా చాటారు. మంగళవారం వెలువడిన యూపీఎస్సీ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 35వ, 410వ, 640వ, 742వ ర్యాంకులు సాధించారు. మొదటి ప్రయత్నంలో విఫలమైనా పట్టు వదలకుండా.. కుంగిపోకుండా మరోసారి ప్రయత్నించి లక్ష్యం నెరవేర్చుకున్నారు. ఎంతోమంది యువతలో స్ఫూర్తి నింపారు. నలుగురిదీ వేర్వేరు నేపథ్యం అయినా ఒకటే లక్ష్యంగా కష్టపడి చదివి జాతీయ స్థాయిలో మెరిశారు. వీరిలో ఒకరు కలెక్టర్ అయ్యే అవకాశం ఉంది.



తల్లి, కుటుంబ సభ్యులతో సివిల్స్ ర్యాంకర్ రేవయ్య

మెరిసిన పేదింటి విద్యాకుసుమం

కూలీ పనులు చేసుకుంటూ పిల్లలను ఉన్నత స్థాయికి చేర్చాలకున్న ఆ తల్లి పడిన కష్టానికి ఫలితం దక్కింది. మాతృమూర్తి కలను సాకారం చేస్తూ రెండో కుమారుడు సివిల్స్‌లో ఆలిండియా స్థాయిలో సత్తా చాటాడు. కుమురంభీం జిల్లా రెబ్బెన మండలం తుంగెడకు చెందిన విస్తారుబాయి, మనోహర్ దంపతులకు ముగ్గురు సంతానం. మనోహర్ 25 ఏళ్ల క్రితమే మృతి చెందాడు. అప్పటి నుంచి పిల్లల భారం తల్లి విస్తారుబాయిపై పడింది. వారిని ఉన్నత స్థాయికి చేర్చేందుకు రెక్కలుముక్కలు చేసుకుంది. దొరికిన కూలీ పనులు చేసుకుంటూ పెంచి పెద్ద చేసింది. ప్రస్తుతం తుంగెడ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికురాలిగా పని చేస్తోంది. పెద్ద కుమారుడు తిర్యాణి మండలంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తుండగా, కూతురు స్వప్న ఎన్ఐటీ నాగ్‌పూర్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేసి ప్రస్తుతం ఉద్యోగ ప్రయత్నంలో ఉంది. రెండో కుమారుడు రేవయ్య సివిల్స్‌లో 410 వ ర్యాంకు సాధించాడు.

రెండో ప్రయత్నంలో విజయం..

ఐఐటీ మద్రాస్‌లో కెమికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన రేవయ్య కొన్నాళ్లు ఓఎన్జీసీలో ఉద్యోగం చేశాడు. ఆ ఉద్యోగంతో సంతృప్తి చెందని అతను సివిల్స్ వైపు దృష్టి సారించాడు. మొదటి ప్రయత్నంలో ఇంటర్వ్యూ వరకు వెళ్లగా, రెండో ప్రయత్నంలో 2022 సివిల్స్ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 410వ ర్యాంకు సాధించాడు.

కష్టపడి చదువుకున్నడు

రేవయ్యకు చదువు అంటే ఎంతో ఇష్టం. చిన్నప్పటి నుంచే ఎంతో కష్టపడి చదువుకున్నడు. పిల్లల చిన్నతనంలోనే తండ్రిని కోల్పోవడంతో చదువులకు మస్తు ఇబ్బందైంది. ఇంజినీరింగ్ సీటు మద్రాసుల వస్తే చదువుకు అందరూ సహకరించారు. సివిల్స్ కోసం ఉద్యోగం మానేసి రాత్రి, పగలు చదువుకున్నాడు. నా కొడుకు పడిన కష్టానికి ఫలితం లభించింది.

– విస్తారుబాయి, రేవయ్య తల్లి

గిరిజన బిడ్డ ఇక కలెక్టర్‌గా...

మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం కర్ణపేటకు చెందిన గిరిజన బిడ్డ అజ్మీరా సంకేత్‌కుమార్(26) కష్టపడి చదివి ఆలిండియా స్థాయిలో 35వ ర్యాంకు సాధించాడు. దేశస్థాయిలో కర్ణపేట, జిల్లా పేరును మార్మోగించాడు. తండ్రి అజ్మీరా ప్రేమ్‌సింగ్‌నాయక్ ఉద్యానవన శాఖ ఉద్యోగి కాగా, తల్లి సవిత ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. సంకేత్‌కుమార్ ప్రాథమిక విద్యను కర్ణపేట, ఇంటర్ హైదరాబాద్‌లోని ప్రైవేటు కాలేజీ, ఐఐటీ(ఢిల్లీ)లో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. అదే కాలేజీలో మాస్టర్ ఆఫ్ రీసెర్చ్ (ఎమ్మార్)లో బంగారు పతకం సాధించాడు. ఏడాదిపాటు జపాన్‌లోని ఓ కంపెనీలో రీసెర్చ్ ఇంజినీర్‌గా చేశాడు. ఐఏఎస్ కావాలనే దృఢ సంకల్పంతో సివిల్స్‌కు సన్నద్ధమయ్యాడు. 2021లో తొలిప్రయత్నంలో విఫలమైనా 2022లో మరోసారి ప్రయత్నించి అత్యుత్తమ ర్యాంకు సాధించాడు. ఐఏఎస్‌కు అర్హత పొందాడు. "గిరిజనులు, నిరుపేదలకు సేవ చేసేందుకు కలెక్టర్ కావాలనుకున్నా.. ఆ మేరకు కష్టపడి చదివాను.. ఆల్ ఇండియా స్థాయిలో 35వ ర్యాంకు రావడం సంతోషంగా ఉంది.." అంటూ సంకేత్‌కుమార్ 'సాక్షి'తో తన ఆనందాన్ని వ్యక్తం చేశాడు.



సంకేత్‌కుమార్

గర్వపడుతున్నాం

కలెక్టర్ కావాలనే ఆకాంక్షను నెరవేర్చేందుకు మేము ప్రోత్సహించాం. మొదటి ప్రయత్నంలో రాకపోయినా బాధపడకుండా కలెక్టర్ కావాలనే లక్ష్యంతో రెండోసారి మంచి ర్యాంకు సాధించాడు. తన చిరకాల కోరిక నెరవేర్చుకున్నందుకు తల్లిదండ్రులుగా ఎంతో గర్విస్తున్నాం.

–సంకేత్ తల్లిదండ్రులు
అజ్మీరా ప్రేమ్‌సింగ్, సవిత

రెండో ప్రయత్నంలో..

మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం సోమనపల్లికి చెందిన తుమ్మల రాజశేఖర్‌రెడ్డి, సంతోష దంపతులది వ్యవసాయ నేపథ్య కుటుంబం. పెద్ద కుమారుడు హైదరాబాద్‌లోని ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. రెండో కుమారుడు సాయికృష్ణారెడ్డి చిన్నప్పటి నుంచే సివిల్స్ రాయాలనే పట్టుదలతో చదివాడు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చెన్నూర్‌లోని ప్రైవేటు పాఠశాలలో అభ్యసించాడు. హైదరాబాద్‌లోని ప్రైవేటు కళాశాలలో ఇంటర్ పూర్తి చేశాడు. అనంతరం నీట్ వరంగల్ లో చదివాడు. కరోనా సమయంలో ఆన్‌లైన్‌లో సివిల్స్ శిక్షణ పొందాడు. హైదరాబాద్‌లో గది అద్దెకు తీసుకొని రెండేళ్లు సివిల్స్‌కు సన్నద్ధం అయ్యాడు. మొదటగా 2021లో సివిల్స్ రాశాడు. కానీ మెయిన్స్‌లో రాకపోవడంతో మళ్లీ 2022లో పట్టుదలతో చదివి సివిల్స్ రాశాడు. రెండో ప్రయత్నంలో 640వ ర్యాంకు సాధించాడు. ఈ ర్యాంకుకు జనరల్ కేటగిరీలో ఐఏఎస్, ఐపీఎస్ పొందలేకపోయినా మెరుగైన ర్యాంకుతో జిల్లా పేరు నిలబెట్టాడు. కుమారుడు సివిల్స్‌లో మంచి ర్యాంకు సాధించడం సంతోషంగా ఉందని సాయికృష్ణ తల్లిదండ్రులు తెలిపారు.



తుమ్మల సాయికృష్ణ

మూడోసారికి సక్సెస్



సాయినాథ్

మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండలం బలరావుపేట గ్రామానికి చెంది న రాందేని సాయినాథ్ సివిల్స్‌లో పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్నించి సక్సెస్ సాధించాడు. 742వ ర్యాంకు సాధించాడు. గ్రామానికి చెందిన చంద్రమౌళి, కవిత దంపతులకు కుమారులు సాయినాథ్, యశ్వంత్ ఉన్నారు. సాయినాథ్ 7వ తరగతి వరకు నస్పూర్‌లో, పదో తరగతి వరకు హైదరాబాద్‌లో చదివాడు. ఇంటర్మీడియెట్ కరీంనగర్‌లోని ప్రైవేటు కళాశాలలో చదివి బీటెక్ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేసి సివిల్స్‌పై దృష్టి సారించాడు. 2019లో మొదటిసారిగా పరీక్షకు హాజరై ప్రిలిమ్స్‌లో ఫెయిలయ్యాడు. రెండోసారి ఇంటర్వ్యూ వరకు వెళ్లి 15మార్కులతో విఫలమయ్యాడు. పట్టు వదలకుండా మూడోసారి ప్రయత్నించడంతో 742వ ర్యాంకు సాధించాడు. "ఆంత్రోపాలజి సబ్జెక్టును ఎంచుకుని శిక్షణ తీసుకున్నాను. తర్వాత సొంతంగా ప్రిపేర్ అవుతూ ప్రతీరోజు ఒక టాపిక్ ఎంచుకుని లక్ష్యాన్ని సాధించాను. మొదట కొంచెం బాధగా అనిపించినా తర్వాత కష్టపడుతూ విజయం సాధించాను.." అని సాయినాథ్ తెలిపాడు.

కేంద్ర పథకాలు రాష్ట్రంలో అమలు చేయడం లేదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సోయం బాపురావ్, వేదికపై తల్లోజు ఆచారి, నాయకులు

- పల్లెపల్లెకు బీజేపీ ముగింపు కార్యక్రమంలో ఎంపీ సోయం బాపురావ్

తానూరు:కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావ్ విమర్శించారు. పల్లెపల్లెకు బీజేపీ ముగింపు బహిరంగ సభ తానూరులో మంగళవారం నిర్వహించారు. ఎంపీ పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఎన్నికల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో పథకాలు అమలు చేయకుండా ప్రజల డబ్బులను అక్రమంగా పోగుచేశారని ఆరోపించారు. దీంతో కేంద్ర ప్రభుత్వం రూ.2 వేల నోట్లు రద్దు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన ఆయుష్మాన్ భారత్, పీఎం ఆవాస్‌యోజన, ఫసల్ బీమా పథకాలను అమలు చేయకపోవడంతో తెలంగాణ ప్రజలు పథకాలకు దూరమవుతున్నారని తెలిపారు. హైదరాబాద్‌లో తలదాచుకున్న ఉగ్రవాదులను కేంద్ర బలగాలు పట్టుకున్నట్లు తెలిపారు. బీజేపీ నాయకులు మోహన్‌రావ్‌పటేల్ ఈ నెల 5 నుంచి పల్లెపల్లెకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజలకు వివరించడాన్ని అయన అభినందించారు.

ఓటు హక్కును వృథా చేయకండి ...

రాజ్యాంగ నిర్మాత బీఆర్.అంబేద్కర్ ఇచ్చిన ఓటు హక్కు ఆయుధాన్ని ప్రజలు వృథా చేసుకోవద్దని బీజేపీ నాయకులు బోస్లే మోహన్‌రావ్‌పటేల్ సూచించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. పల్లెపల్లెకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి కేంద్ర ప్రభుత్వం పథకాలను ప్రజలకు వివరించినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు.

తాగుబోతు తెలంగాణగా..

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తమ జీవితాలు బాగుపడతాయని అన్నివర్గాలు ఉద్యమాలు చేసి రాష్ట్రం తెచ్చుకుంటే కేసీఆర్ కుటుంబం తెలంగాణను తాగు బోతుల తెలంగాణగా మార్చారని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచార్య ఆరోపించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం యుకు లు, కళాకారులు, ఉద్యోగులు, ప్రజలు ఉద్యమాలు చేసినా గుర్తింపు లేకపోయిందన్నారు. నిరుద్యోగులు నోటిఫికేషన్లు రాక రోడ్డున పడుతున్నారన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ప్రజలకు వైద్యం అందకుండా పోతోందన్నారు. ప్రజలు వచ్చే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుభాష్, రవి, గోపాల్‌రావ్ పటేల్, నాగేందర్, జ్ఞానేశ్వర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తల మధ్య తోపులాట

సోయం బాపురావ్ ప్రసింగిస్తుండగా కొంత మంది కార్యకర్తలు అన్నం తినేందుకు వెళ్లారు. సమావేశం ముగిసేవరకు ఆగాలని కొందరు చెప్పడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. కార్యకర్తలు కుర్చీలు విసురుకున్నారు.

ఆర్డీవో కార్యాలయం ప్రారంభం



ఆర్డీవో కార్యాలయం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, దండె విఠల్, కలెక్టర్

సారంగపూర్: మండలంలోని చించోలి(బి) గ్రామ సమీపంలో 3.50 కోట్లతో నిర్మించిన ఆర్డీవో కార్యాలయాన్ని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్సీ దండే విఠల్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మల్ జిల్లాను సాధించుకున్న తర్వాత జిల్లాను ఎంతో అభివృద్ధి చేశామని అన్నారు. రూ.160 కోట్లతో నూతన కలెక్టర్ సముదాయ భవనం, జిల్లాకు కొత్తగా మెడికల్ కళాశాల, మైనారిటీ గురుకుల పాఠశాల, ప్రతీ గ్రామానికి పక్కారోడ్లు, ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని వివరించారు. ప్రభుత్వ వైద్యశాలల్లో అన్నిరకాల వసతులను కల్పించామని, ప్రసూతి ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేసి ప్రైవేటుకు దీటుగా అన్నిరకాల సదుపాయాలు కల్పించామని తెలిపారు. మైనారిటీ గురుకులం, కలెక్టరేట్, మెడికల్ కళాశాలలను త్వరలోనే సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రరంభోత్సవం చేయించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ చాట్ల లక్ష్మి, మండల ప్రజాప్రతినిధులు, జిల్లా రవాణా శాఖ అధికారి అజయ్‌రెడ్డి, కాంట్రాక్టర్ జగన్మోహన్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నకిలీలపై టాస్క్‌ఫోర్స్!

- నాసిరకం విత్తనాలు, పురుగుల మందుల అమ్మకానికి చెక్
- వ్యవసాయ, పోలీసు శాఖ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు
- ఫర్టిలైజర్స్ దుకాణాలు, విత్తన తయారీ కేంద్రాల్లో తనిఖీలు
- రైతులు అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు

నిర్మల్ చైన్‌గేట్:వానాకాలం సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో అన్నదాతలు దుక్కులు సిద్ధం చేస్తున్నారు. తొలకరి వర్షాలు పడగానే విత్తనాలు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇదే అదనుగా భావించి విక్రయదారులు నకిలీ, నాసిరకం విత్తనాలు రైతులకు అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం నకిలీపై నజర్ పెట్టింది. జిల్లాలోని ఆయా మండలాలు, డివిజన్ కేంద్రాల్లో ప్రత్యేక టాస్‌ఫోర్స్ బృందాలతో తనిఖీలు చేపడుతున్నారు. నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై పీడీ యాక్టు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

ప్రత్యేక బృందాల ఏర్పాటు..

వానాకాలంలో చాలా మంది రైతులు పత్తి, మొక్కజొన్న పంటలను అధికంగా సాగు చేస్తుంటారు. ఇదే సమయంలో నకిలీ, అనుమతి లేని విత్తనాలు, నిషేధిత మందులు విక్రయించేందుకు వ్యాపారులు ప్రయత్నాలు చేస్తుంటారు. నకిలీ విత్తనాలు విత్తి దిగుబడి తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. దీన్ని అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసింది. ఈ బృందంలో వ్యవసాయశాఖ ఏడీఏ, సీఐ, ఎస్ఓటీ, ఎస్‌సీవో(సీడ్ సర్టిఫయింగ్ ఆఫీసర్)లు ఉన్నారు. అధికారులు ఎరువులు, విత్తనాల దుకాణాల్లో విత్తనాలు, పురుగుల మందుల స్టాకు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. దుకాణాలకు సంబంధించి లైసెన్సులు, విత్తనాల స్టాక్ జాబితాలను పరిశీలిస్తున్నారు. విత్తనాలు, ఫర్టిలైజర్ మందుల విక్రయానికి సంబంధించిన రశీదు పుస్తకాలను తనిఖీ చేస్తున్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న టాస్క్ ఫోర్స్ బృందం

విత్తనాల ఎంపికలో జాగ్రత్త ...

- లైసెన్సులు పొందిన డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు కొనుగోలు చేయాలి.
- కొనుగోలు చేసిన దానికి సంబంధించి డీలర్ల సంతకంతో కూడిన రశీదు తీసుకోవాలి. రశీదుపై కొనుగోలు చేసిన తేదీ, విత్తనాల రకం, పరిమాణం, ధర, లాట్ నంబర్ తదితర వివరాలను పూర్తి స్థాయిలో నమోదు చేయించుకోవాలి.
- రైతులు రంగురంగు ప్యాకెట్లను చూసి మోసపోవద్దు. కంపెనీ విశ్వసనీయత, విత్తనాల నాణ్యత, మొలక శాతం తదితర వివరాలను పరిశీలించాలి.
- విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేసిన తర్వాత ఖాళీ విత్తనాల సంచులను పంట చేతికొచ్చే చివరి దశ వరకు జాగ్రత్తగా భద్రపర్చాలి. తేడా వస్తే ఆధారాలతో ఫిర్యాదు చేయాలి.
- కొందరు వ్యాపారులు ప్రముఖ కంపెనీల పేరుతో నకిలీ ప్యాకింగ్‌లో నాసిరకం విత్తనాలు నింపి విక్రయించేందుకు ప్రయత్నిస్తుంటారు. విత్తనాలే కాకుండా వాటి ధ్రువీకరణకు వినియోగించే ప్రభుత్వ లేబుళ్లను జాగ్రత్తగా పరిశీలించాలి. అవసరమైతే వ్యవసాయ అధికారులను సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకోవాలి. నాసిరకం పాలిథిన్ సంచుల్లోని విత్తనాలు కొనుగోలు చేయొద్దు.
- విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత మొలక శాతాన్ని పరీక్షించుకోవాలి. మొలక శాతం తక్కువగా ఉంటే విత్తనాలను తిరిగి డీలర్‌కు ఇవ్వొచ్చు.
- సీజన్ ప్రారంభం కావడంతో కొందురు బిల్లులు లేకుండా విత్తనాలు అమ్ముతుంటారు. వారిపై వెంటనే వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలి.. విత్తనాలు ఏయే భూముల్లో పండుతాయనే వివరాలు ప్యాకెట్ పై స్పష్టంగా రాసి ఉంటుంది సరిచూసుకోవాలి.
- నాటిన వంద విత్తనాల్లో 80 మొలకెత్తితే అవి నాణ్యమైనవని గుర్తించాలి. నకిలీ విత్తనాలైతే మొలకెత్తకపోవడం మొలక శాతం తక్కువగా ఉండటం, ఏపుగా పెరిగినా కాపు లేకపోవడం వంటివి జరుగుతాయి. ఈలక్షణాలు కనిపిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలి.
- విత్తనాల మార్కెట్‌ను పెంచడం, అధికంగా విత్తనాలు అమ్మడం కోసం వివిధ కంపెనీలు వ్యాపారులకు బహుమతులు, టూర్ల ఆఫర్లు ప్రకటిస్తుంటాయి, దీనికి ఆశపడి డీలర్లు విత్తన ప్యాకెట్ల అమ్మకాన్ని పెంచుతారు. నాణ్యమైన విత్తనాలని, మంచి దిగుబడులు వస్తాయని నమ్మించి అంటగట్టే ప్రయత్నం చేస్తారు. అందుకే విత్తనాల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

నకిలీవి విక్రయిస్తే చర్యలు తప్పవు

వ్యాపారులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.. కాలం చెల్లిన, ప్రభుత్వం నిషేధించిన విత్తనాలు, పురుగుల మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించొద్దు. రైతులు ఎరువులు, విత్తనాలు కొనేటప్పుడు విధిగా దుకాణాల యజమానుల నుంచి రశీదులు తీసుకోవాలి. విత్తనాల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అధికారుల సూచనలు, సలహాలు పాటించాలి. – అంజిప్రసాద్, ఏడీఏ నిర్మల్

క్లుప్తంగా

34 మందికి జరిమానా

నిర్మల్‌టౌన్‌: మద్యం తాగి వాహనాలు నడిపిన 34మందికి జరిమానా, ఒక్కొక్కరికీ సాధారణ జైలు విధిస్తూ నిర్మల్‌ న్యాయస్థానం తీర్పునిచ్చినట్లు పట్టణ ట్రాఫిక్‌ ఎస్సైలు రాజశేఖర్‌, దేవేందర్‌ తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. మద్యం మత్తులో వాహనం నడుపుతూ పలువురు పట్టుబడగా వారిని నిర్మల్‌ కోర్టులో హాజరు పరిచారు. 34మందికి రూ.35,300 జరిమానా విధిస్తూ స్పెషల్‌ జుడిషియల్‌ జడ్జి తీర్పునిచ్చారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణం కావొద్దని ట్రాఫిక్‌ ఎస్సైలు పేర్కొన్నారు.

బ్రిజ్‌ భూషణ్‌ను అరెస్ట్‌ చేయాలి



నిరసన తెలుపుతున్న నాయకురాలు

ఎదులాపురం: భారతదేశ మహిళా క్రీడాకారులు, రెజ్లర్లపై అసభ్యంగా ప్రవర్తించి లైంగిక వేధింపులకు పాల్పడిన భారత రెజ్లింగ్‌ సమాఖ్య అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌ భూషణ్‌ శరణ్‌ సింగ్‌ను అరెస్ట్‌ చేయాలని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి ముడుపు నళినీరెడ్డి డిమాండ్‌ చేశారు. మంగళవారం రాత్రి జిల్లా కేంద్రంలోని సమాఖ్య ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఆమె మాట్లాడుతూ అథ్లెటిక్స్‌లో అనేక పతకాలు సాధించి దేశానికి పేరుతీసుకొచ్చిన క్రీడాకారులకు రక్షణ లేదన్నారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన శరణ్‌ సింగ్‌ను అరెస్టు చేయకపోవడం కేంద్ర ప్రభుత్వ నీతిమాలిన రాజకీయాలకు నిదర్శనమన్నారు. రాష్ట్ర కౌన్సిల్‌ సభ్యురాలు ఆత్రం సంగీత, అమీనా, జిల్లా కౌన్సిల్‌ సభ్యులు ఆత్రం రేఖ, కృష్ణవేణి, తార, జంగుబాయి, రేనాబాయ్‌, సవిత, అరుణ, సావిత్రి, సునంద, వనిత, మడావి రేణ పాల్గొన్నారు.

గుడుంబా స్థావరంపై దాడి


బెల్లంపానకం పారబోస్తున్న పోలీసులు

సారంగాపూర్‌: మండలంలోని రవీంద్రనగర్‌ గ్రామంలో మంగళవారం పోలీసులు గుడుంబా స్థావరంపై దాడి చేశారు. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి వివరాల ప్రకారం.. గుడుంబా తయారీకి ఉపయోగించే బెల్లం పానకం, ముడిసరుకులను ధ్వంసం చేశారు. ఇద్దరు మహిళలను తహసీల్దార్‌ సంతోష్‌రెడ్డి ఎదుట బైండోవర్‌ చేశారు. గుడుంబా తయారు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కలెక్టరేట్‌లో గాడిదలు..!


కలెక్టరేట్‌ ఆవరణలో గాడిదలు

ఎదులాపురం: కలెక్టరేట్‌లో మంగళవారం గాడిదలు దర్శనమిచ్చాయి. జిల్లా ఉన్నతాధికారి కార్యాలయ పరిసర ప్రాంతాల్లో ఇలా యథేచ్ఛగా పశువులు సంచరిస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. అంతే కాకుండా అక్కడక్కడ ఉన్న ఖాళీ ప్రదేశాలు చిత్తు కాగితాలు, చెత్తతో దర్శనమిస్తుండటం గమనార్హం. పరిసరాల పరిశుభ్రత, చెత్త నిర్వహణ వర్తించదు కాబోలు... ఇప్పటికైనా పశువులు చొరబడకుండా, చెత్త నిర్వహణపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

హమాలీలుగా బిహారీలు


వట్టోలిలో లారీలో లోడ్‌ చేస్తున్న బిహార్‌ హమాలీలు

- కొనుగోలు కేంద్రాల్లో ఉపాధి పొందుతున్న వైనం
- యేటా సీజన్‌లో ఇక్కడే..
- స్థానికంగా హమాలీల కొరత

లోకేశ్వరం: ఏటా యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో బిహార్‌ రాష్ట్రానికి చెందిన హమాలీలే ఎక్కువ. వారికి సొంత రాష్ట్రంలో పనులు లేక వలస వస్తుంటారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం ధాన్యం చేతికి రావడంతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. ఏటా సీజన్‌లో దాదాపు జిల్లాకు మూడు వేల మంది వరకు ఇక్కడే ఉపాధి పొందుతుంటారు. ఒక్కో కొనుగోలు కేంద్రంలో దాదాపు 10–20 మంది వరకు హమాలీలు పని చేస్తుంటారు. జిల్లాలో డీసీఎమ్మెస్‌, పీఏసీఎస్‌, ఐకేపీ ఆధ్వర్యంలో 196 వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు.

రూ.20వేల ఆదాయం...

మహారాష్ట్ర, బిహార్‌ రాష్ట్రాల నుంచి వచ్చే కూలీలు కొనుగోలు కేంద్రాల వద్దే కుటుంబాలతో ఉంటారు. కేవలం ముథోల్‌ నియోజకవర్గంలోనే ఇతర రాష్ట్రాల హమాలీ బృందాలు ఉన్నాయి. ఒక్కో కేంద్రంలో 10–20 మంది వరకు పని చేస్తున్నారు. ధాన్యాన్ని బట్టి వీరి సంఖ్య పెరగవచ్చు. ధాన్యాన్ని సంచుల్లో నింపడం, తూకం వేయడం, తర్వాత లారీల్లోకి ఎక్కించడం వంటి పనులకు క్వింటాల్‌కు రూ.23–29 వరకు చెల్లిస్తున్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని బట్టి ఒక్కొక్కరికీ రోజుకు రూ.500–రూ.1000 వరకు


లోకేశ్వరంలో తూకం చేస్తున్న బిహారీలు

కూలి గిట్టుబాటు అవుతుంది. ఇలా సీజన్‌కు రూ.25 వేల వరకు మిగులుబాటు అవుతాయని వారు పేర్కొంటున్నారు.

ధాన్యం బస్తాలు నింపి తూకం చేయడంతో పాటు లారీల్లో నింపేందుకు స్థానికంగా హమాలీలు దొరకడం లేదు. దీంతో చేసేదేమీ లేక కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు బిహార్‌తో పాటు మహారాష్ట్రలోని నాందేడ్‌, అమరావతి ప్రాంతాల నుంచి హమాలీలను రప్పిస్తుంటారు. అలాగే ప్రతీ రైస్‌మిల్లులో సైతం బిహార్‌కు చెందిన హమాలీలే ఎక్కువగా కనిపిస్తుంటారు.

ప్రతీ సీజన్‌లో వస్తాం


ప్రతీ సీజన్‌లో ఈ ప్రాంతానికి వలస వస్తాం. దాదాపు ఎనిమిదేళ్లుగా ఈ జిల్లాలో వరి కొనుగోలు కేంద్రాల్లో పని చేస్తున్నాం. ఇక్కడ సంపాదించిన దాంతోనే కుటుంబాన్ని వెల్లదీస్తున్నాం. ప్రతీ సీజన్‌లో వచ్చిన ధాన్యాన్ని బట్టి రూ.10–20వేల సంపాదిస్తాం.

– అశోక్‌ సర్దార్‌, శీపోల్‌ జిల్లా

మా దగ్గర నీటి సమస్య


మా ప్రాంతంలో సాగు నీటి సమస్యతోనే హమాలీ పనులకు వస్తున్నాం. అక్కడ కందులు, మినుములు, పెసర పంటలు వర్షాధారంగా పండుతాయి. ప్రతీ సీజన్‌లో ఇక్కడికి వచ్చి ఉపాధి పొందుతుంటాం.

– ప్రకాష్‌, హరారీయా జిల్లా

చాలా కేంద్రాల్లో మావాళ్లే


చాలా కొనుగోలు కేంద్రాల్లో మహారాష్ట్ర, బిహార్‌ నుంచి వచ్చిన వారే ఉంటారు. మా దగ్గర సరిగా వర్షాలు లేక పంటలు పండవు. దీంతో ఉపాధి కోసం ప్రతీ సీజన్‌లో రెండు నెలలు ఇక్కడే ఉంటాం. ఇక్కడ సంపాదించిన డబ్బులే మాకు జీవనాధారం.

– సోగాలాల్‌ సర్దార్‌, శీపోల్‌ జిల్లా

ముఖరా(కె)ను ఆదర్శంగా తీసుకోవాలి

- కలెక్టర్‌ రాహుల్‌ రాజ్‌

కైలాస్‌నగర్‌/ఇచ్చోడ: జిల్లాలోని ప్రతి గ్రామం ముఖరా(కె) గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని అభివృద్ధిబాటలో నడవాలని కలెక్టర్‌ రాహుల్‌ రాజ్‌ పిలుపునిచ్చారు. ఇటీవల పంచాయతీ రాజ్‌ జాతీయ అవార్డును అందుకున్న ఇచ్చోడ మండలం ముఖరా(కె)సర్పంచ్‌ గాడ్గె మీనాక్షిని మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి జాతీయ అవార్డుకు ఈ గ్రామం ఎంపిక అవుతుందని, గడిచిన నాలుగేళ్లలో 5 జాతీయ స్థాయి అవార్డులు జిల్లాకు తీసుకురావడం గర్వకారణమన్నారు. గ్రామంలో ప్రతీ కార్యక్రమం విజయవంతం అవుతుందని, గ్రామంలో నాటిన ప్రతీ మొక్క వృక్షంగా ఎదిగేలా రక్షణ చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లెప్రగతితో గ్రామాల రూపురేఖలు మారాయన్నారు. ఈ కార్యక్రమంలో డీపీవో శ్రీనివాస్‌, డీఆర్‌డీవో ఏపీడీ రాథోడ్‌ రవీందర్‌, జలశక్తి అభియాన్‌ కో ఆర్డినేటర్‌ గోరఖ్‌, ఎంపీటీసీ గాడ్గె సుభాష్‌ పాల్గొన్నారు.


సర్పంచ్‌ గాడ్గే మీనాక్షిని సత్కరిస్తున్న కలెక్టర్‌ రాహుల్‌రాజ్‌

ఒమన్‌లో యువకుడి ఆత్మహత్య

- వారం రోజులకు స్వగ్రామానికి మృతదేహం


మణికంఠ(ఫైల్‌)

బజార్‌హత్నూర్‌: మండల కేంద్రానికి చెందిన దనగరి పండరి, రేణుకల చిన్న కుమారుడు దనగరి మణికంఠ(26) ఒమన్‌ దేశంలో వారం రోజుల క్రితం ఆత్మహత్య చేసుకోగా మంగళవారం మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... దనగరి మణికంఠ 2017లో ఒమన్‌ దేశంలోని మస్కట్‌ సమీపంలోని సుహస్‌ పట్టణంలో ఉద్యోగంలో చేరాడు. మంచి వేతనంతో కుటుంబానికి ఆర్థికంగా అండదండగా ఉంటున్న సమయంలో అక్కడ ఏమి జరిగిందో తెలియదు ఈ నెల 15న ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో వారం రోజులుగా తల్లితండ్రులు కుమారుడి చివరిచూపు ఎదురుచూస్తూనే ఉన్నారు. ఎట్టకేలకు మస్కట్‌లోని తెలంగాణకు చెందిన స్వచ్ఛంద సంస్థ సభ్యులు పొల్సాని లింగయ్య, కర్వల మాధవ్‌ సాయంతో మంగళవారం మృతదేహం గ్రామానికి చేరుకోవడంతో అంత్యక్రియలు నిర్వహించారు.

ఎస్సై సమయస్ఫూర్తితో తప్పిన ప్రమాదం

- షార్ట్‌ సర్క్యూట్‌తో ఐచర్‌ వాహనానికి మంటలు


మంటలు ఆర్పివేస్తున్న గ్రామస్తులు

నార్నూర్‌: పశుగ్రాసం తరలిస్తున్న వ్యాన్‌కు విద్యుత్‌ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు అంటుకోగా ఎస్సై చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. లోకారి కె.సత్యం చెందిన ఐచర్‌ వాహనంలో ఉమ్రి గ్రామానికి చెందిన రాథోడ్‌ నారాయణ్‌కు సంబంధించిన పశుగ్రాసం (చొప్పా)ను గాదిగూడ మండలంలోని పున్నగూడ లొద్దిగూడ గ్రామానికి మంగళవారం తరలిస్తున్నాడు. డాబా(బి) ఎస్సీగూడలో పశుగ్రాసానికి విద్యుత్‌ తీగలు తగలి షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయి. సమాచారం అందుకున్న ఎస్సై ఇమ్రాన్‌ సంఘటనా స్థలానికి చేరుకుని అతడి డ్రైవర్‌ సాయంతో ఆ వాహనాన్ని గ్రామం బయటకు తీసుకెళ్లాడు. మంటలు అంటుకున్న పశుగ్రాసాన్ని బయటకు తీయగా గ్రామస్తుల సాయంతో మంటలు ఆర్పివేశారు.


వాహనంలో దగ్ధమవుతున్న చొప్పా

ఉరేసుకుని వ్యక్తి మృతి

ముథోల్‌: మండల కేంద్రంలోని కోలిగల్లికి చెందిన సప్పటోల్ల చిన్నన్న (57) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయికిరణ్‌ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మృతుడు 5ఏళ్లుగా షుగర్‌ వ్యాధితో బాధపడుతుండగా కాలుకు పెద్ద గాయం కావడంతో తగ్గడం లేదు. మనస్తాపానికి గురైన చిన్నన్న సోమవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వార్డు సభ్యురాలు మృతి

లోకేశ్వరం: మండలంలోని హవర్గ గ్రామ పంచాయతీ ఏడవ వార్డు సభ్యులు ముచ్చింద్ల లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందింది. గ్రామ సర్పంచ్‌ భుజంగ్‌రావు వివరాల ప్రకారం... లక్ష్మి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. చికిత్స కోసం ఎన్నో ఆస్పత్రులు తిరిగినా నయం కాలేదు. పరిస్థితి విషమించి మంగళవారం ఇంటి వద్దనే మృతిచెందింది.

బైక్‌ పైనుంచి పడి ఒకరి మృతి

సోన్‌: బైక్‌పై నుంచి పడి ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలోని గోదావరి వంతెనపై చోటుచేసుకుంది. గోపు శేఖర్‌ (47) మాదాపూర్‌ గ్రామంలో తన భూమిని చూసేందుకు బైక్‌పై వచ్చాడు. తిరిగి వెళ్లే క్రమంలో వంతెనపై ప్రమాదవశాత్తు కిందపడగా తీవ్ర గాయాలై మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత అదృశ్యం


లక్ష్మి (ఫైల్‌)

నర్సాపూర్‌(జి): మండల కేంద్రానికి చెందిన నలిమికొండ లక్ష్మి (32) శుక్రవారం రాత్రి నుంచి కనబడకపోవడంతో భర్త సంతోష్‌ మంగళవారం స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గీత పేర్కొన్నారు.

గడ్డెన్నవాగు ప్రాజెక్ట్‌లో పడి ఒకరి మృతి

భైంసాటౌన్‌: ప్రమాదవశాత్తు గడ్డెన్నవాగు ప్రాజెక్ట్‌లో పడి ఒకరు మృతి చెందారు. ఎస్సై గణేశ్‌ కథనం ప్రకారం.. కుబీర్‌ మండలం హల్దా గ్రామానికి చెందిన ఎస్‌ ప్రకాశ్‌(42) గ్రామంలో వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. సోమవారం భైంసాలోని రాహుల్‌నగర్‌లో ఓ శుభకార్యానికి వచ్చాడు. అనంతరం బహిర్భూమికి గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు వెళ్లాడు. ఎంతకీ తిరిగిరాకపోవడంతో మంగళవారం ఉదయం గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్దకు వెళ్లి చూడగా కుటుంబీకులకు చెప్పులు కనిపించాయి. దీంతో పోలీసులకు సమాచారమివ్వగా వారు చేరుకుని మృతదేహాన్ని వెలికితీయించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఏరియాస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు రాహుల్‌ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మార్లావాయి సర్పంచ్‌కు జీవ వైవిధ్య అవార్డు

నార్నూర్‌(జైనూర్‌): జైనూర్‌ మండలంలోని మార్లావాయి గ్రామ పంచాయతీ సర్పంచ్‌ కనక ప్రతిభ వెంకటేశ్వరావు మంగళవారం హైదరాబాద్‌లోని భాస్కర ఆడిటోరియంలో రాష్ట్ర స్పెషల్‌ చీఫ్‌ సెక్రటరీ రజిత కుమార్‌, రాష్ట్ర బయోడైవర్శిటీ బోర్డు మెంబర్‌ ఆఫ్‌ సెక్రటరీ చరణ్‌దాస్‌ కర్తాడే చేతుల మీదుగా "తెలంగాణ స్టేట్‌ బెస్ట్‌ బయోడైవర్శిటీ అవార్డు" (జీవవైవిధ్య)ను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్లావాయి గ్రామ పంచాయతీ పరిధిలో పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం, ఇతర జీవాలను కాపాడడమే లక్ష్యంగా అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. పక్షులు, జంతువులు, వన్యమృగాలను వేటగాళ్ల నుంచి విముక్తి కల్పించడం కోసం చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వందశాతం ప్లాస్టిక్‌ రహిత గ్రామంగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. మార్కెట్‌కు కూరగాయల కోసం వెళ్లే వారికి ప్లాస్టిక్‌ రహిత బ్యాగులు అందజేసినట్లు తెలిపారు. గ్రామంలో ఇంకుడుగుంతల నిర్మాణం, జీవ వైవిధ్యంపై అవగాహన ర్యాలీలు నిర్వహించినట్లు వివరించారు. జీవామృతంతో సేంద్రియ వ్యవసాయంతో లాభాలు, మానవ మనుగడకు జీవవైవిధ్యం ఎంత అవసరమో ప్రజలకు తెలియజేసినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలో చేపడుతున్న జీవవైవిధ్యం కార్యక్రమాలను గుర్తించి అవార్డుతో సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఆమె వెంట ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు ఉన్నారు.


అవార్డు అందుకుంటున్న సర్పంచ్‌ కనక ప్రతిభ వెంకటేశ్వరావు

మా నాన్నను కాపాడండి..

- తలలో రక్తం గడ్డకట్టడంతో కోమా..
- హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స..
- ఆపరేషన్‌కు రూ.3లక్షలు కావాలన్న వైద్యులు
- చేతిలో చిల్లిగవ్వలేక కుటుంబీకుల సతమతం
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు


హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న మధు

ఉట్నూర్‌రూరల్‌: మండలంలోని లక్కారం గ్రామ పంచాయతీ పరిధిలోని రాంజీగోండ్‌నగర్‌కు చెందిన కుడిమెత మధుకు భార్య లక్ష్మీబాయి, కుమారుడు పవన్‌ 8వ తరగతి, కూతురు మయూరి ఐటీఐ చదువుతున్నారు. ఆదిలాబాద్‌లోని ఐఎంఎల్‌ డిపోలో హమాలీగా పనిచేస్తూ కుటుంబాన్ని సాదుకుంటున్నాడు. ఈ క్రమంలో నెలరోజులుగా అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో కుటుంబీకులు నాటువైద్యం చేయించినప్పటికీ నయం కాలేదు. వారం రోజుల క్రితం మధు పరిస్థితి విషమించడంతో రిమ్స్‌ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మెదడులో రక్తం గడ్డకట్టిందని తెలిపారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌ తరలించాలని సూచించారు. దీంతో కుటుంబీకులు హైదరాబాద్‌లోని వెల్నెస్‌ ఆస్పత్రిలో చేరించగా అక్కడ వైద్యులు ఆపరేషన్‌ చేయాలని సూచించారు. దీనికి రూ.3లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలుపడంతో నిరుపేద కుటుంబానికి చెందిన భార్య లక్ష్మీబాయి దిక్కుతోచని స్థితిలో ఉండిపోయింది. మా నాన్నను కాపాడాలని ఆ చిన్నారులు వేడుకుంటున్నారు.

మస్కుల తిరుపతి
– ఫోన్‌ పే, గుగూల్‌ పే నం.9494150299
– ఎస్‌బీఐ 62148033356,
– బ్రాంచ్‌ ఉట్నూర్‌
ఐఎఫ్‌సీ కోడ్‌.ఎస్‌బీఐఎన్‌0020133

ట్రెయినీ ఎఫ్‌ఎస్వోల పర్యటన


అవగాహన కల్పిస్తున్న ఎఫ్‌ఆర్వో చోలే అనిత

కడెం: దూలపల్లి అటవీ అకాడమీకి చెందిన 15 మంది ట్రెయినీ ఎఫ్‌ఎస్వోలు మంగళవారం కడెంలో పర్యటించారు. మండలంలోని కొత్త మద్దిపడగ గ్రామ సమీపంలో రాంపూర్‌, మైసంపేట్‌ గ్రామస్తులకు ఏర్పాటు చేస్తున్న పునరావాస కాలనీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అటవీ, వన్యప్రాణుల సంరక్షణపై కడెం ఎఫ్‌ఆర్వో చోలే అనిత అవగాహన కల్పించారు.

అడవుల్లో ట్రైనీ ఎఫ్‌ఎస్‌వోల పర్యటన

ఖానాపూర్‌: రాష్ట్ర అటవీ అకాడమీ దూలపల్లి శిక్షణ కేంద్రానికి చెందిన శిక్షణ ఎఫ్‌ఎస్‌వోలు మంగళవారం ఖానాపూర్‌ అడవుల్లో పర్యటించారు. ఖానాపూర్‌ ఎఫ్‌డీవో కోటేశ్వర్‌రావు, ఎఫ్‌ఆర్‌వో వినాయక్‌ వీరికి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆరు నెలల శిక్షణలో భాగంగా 11 రోజుల పాటు క్షేత్ర పర్యటనలో పాల్గొంటారని తెలిపారు.


ట్రైనీ ఎఫ్‌ఎస్‌వోలకు అవగాహన కల్పిస్తున్న ఎఫ్‌డీవో

అపూర్వ సమ్మేళనం


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

సోన్‌: మండలంలోని న్యూవెల్మల్‌ బొప్పారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005–06లో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. అనాటి జ్ఞాపకాలు నెమరేసుకుని ఆనందంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువలతో సత్కరించారు. ఇందులో సుమారుగా 80 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఉపాధ్యాయులు నీల రమేష్‌, రామక్రిష్ణ, గంగాసురేష్‌, వసుంధర పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్‌: ఆదిలాబాద్‌ రూరల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని రణదీవేనగర్‌లో పేకాటాడుతున్న ఏడుగురిని మంగళవారం అరెస్టు చేసినట్లు సీసీఎస్‌ (సెంటర్‌ క్రైమ్‌ స్టేషన్‌) సీఐ చంద్రమౌళి తెలిపారు. ఆయన కథనం ప్రకారం... ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు రణదీవేనగర్‌లో పేకాటాడుతున్నట్లు వచ్చినా విశ్వసనీయ సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడిచేశారు. ఏడుగురు పేకాటరాయుళ్లను పట్టుకుని వారి వద్ద నుంచి రూ.7,690 నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారిపై ఆదిలాబాద్‌ రూరల్‌ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు సీఐ తెలిపారు.

మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం స్పెషల్‌ టీం పోలీసులు పేకాట స్థావరంపై దాడిచేసి ఐదుగురిని పట్టుకున్నారు. వారివద్ద నుంచి రూ.18,200 నగదుతో పాటు 6 సెల్‌ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై దేవురావు తెలిపారు.